# దైనందినం

## 2

ప్రొద్దున్న తొమ్మిదింబావు —

హిమాయత్‌నగరులో మసీదు కెదురుగా సందు. ఆ సందులోంచి వస్తారు ఒక యువతి, ఒక యువకుడు. ఆ అమ్మాయి సన్నగా, పొడుగ్గా వున్న నొక్కులజుట్టుని ఫేషనబుల్‌గా చుట్టచుడుతుంది. సన్నజాజిపూలు తెల్లగా, వంపుగా ఉంటాయి ఆ చుట్టమీద. చాలా నాజూకయిన చీరలు కట్టుకుంటుంది. కళ్లకి చలవజోడు, చేతిలో ఒక అందమైన అల్లికసంచీ. ఇంక ఆ అబ్బాయి - చామనచాయ, కనుముక్కు తీరుబాగుంటుంది. అతను గాగుల్స్ పెట్టుకుంటాడు. అతని చేతిలో న్యూస్ పేపరు, ఒకటి రెండు పుస్తకాలు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, లోకంతో సంబంధం లేనట్లుగా దేనివంకా చూడకుండా నడుస్తారు. రోడ్డుపొడుగునా వుండే ఇళ్లన్నింటి వంకా నిర్లిప్తంగా చూస్తుంది ఆ అమ్మాయి. కాని ఆ చూపులో భావ మేమిటో ఎవ్వరికీ అర్థమయ్యే అవకాశం లేదు నల్లకళ్ళజోడు మూలాని. అతనేదో అనేసరికి ఆ అమ్మాయి సన్నగా నవ్వింది. కుడిచేతివైపున్న చిన్న మేడవైపు ఆ అమ్మాయి పరీక్షగా చూసింది. ఇంటిముందు పూలు నచ్చాయి ఆమెకి. ఏదో అంటుంది ఆపూలనుచూసి. అతను తలూపాడు.

ఆ ఇల్లు బెంగాలీలది. ఒక ముసలాయన, ఆయన రెండోపెళ్లి భార్య, ఆవిడ సవితి కూతురు ఇరవై యేళ్ల పిల్ల ఉంటారు ఆ యింట్లో. తొమ్మిదింబావుకి ఆ అమ్మాయి మేడమీద వరండాలో కూర్చొని పేపరు తిరగేస్తుంటుంది. వీళ్ళని చూడగానే ఒక కేకవేస్తుంది కీచుకంఠంతో. ఆ సవితి తల్లి పరుగెత్తుకొస్తుంది. ముందుముందుకు వంగి వాళ్లిద్దరి వంకా చూస్తారు. ఏదో అనుకుంటారు – నవ్వుకుంటారు.

యువతీ, యువకుడు నడుస్తూంటారు. ఒక సైకిలు షాపు. ఈ మాటు అతను చూస్తాడు తలతిప్పి. తొమ్మిదీ ఇరవైకి ఆ సైకిలుషాపు కుర్రాడు సైకిళ్లు 'ఆయిల్' చేస్తుంటాడు. ఆ అమ్మాయివంక పరీక్షగా చూస్తూ, ఒకచోటునే రెండుసార్లు ఆయిల్ చేస్తాడు పొరపాటున. కళ్ళతోనే తినేసేలాగ చూస్తాడు ఆ యజమాని. వీళ్ళు కొంతదూరం పోగానే, కుర్రాడూ, యజమానీ ఒకళ్ళనొకళ్ళు చూసుకుని భావస్ఫోరకంగా నవ్వుకుంటారు.

ఆ ప్రక్కనే హోటలు. గోలగా రేడియో అరుస్తుంటుంది. ప్రొప్రైటరు తన గడియారం 'కీ' ఇచ్చేవేళ అది. ఈ జంటను చూడగానే చటుక్కున వాచీ తీసి 'కీ' ఇస్తాడు. రేడియో ఒకమాటు అటూఇటూ తిప్పి, ఆ అబ్బాయినీ, అమ్మాయినీ కలిపి ఒక్కమాటే చూసేస్తాడు.

వాళ్లు నారాయణగూడ జంక్షన్ దాటి బస్‌స్టాపు దగ్గరకి వెడతారు. తొమ్మిదీ ఇరవైఐదుకి బస్‌వస్తుంది. ఆ అమ్మాయి బస్ ఎక్కుతుంది. అతను చిరునవ్వుతో చెయ్యి వూపుతాడు. బస్ వెళ్లిపోతుంది.

రాత్రి ఏడూ ఏభైఐదు —

నారాయణగూడ సినీమాహాలుదగ్గర బస్సు ఆగుతుంది. అమ్మాయి, అబ్బాయి బస్‌దిగి నారాయణగూడ జంక్షన్‌దాటి, హిమాయత్‌నగరు రోడ్డుమీద నడుస్తుంటారు. మళ్లాహోటలు. ఆకుపచ్చ లైట్లు. అద్దాల బీరువాలు.

ఫలహారాలు. ఆ హోటలు ప్రొప్రైటరు తన స్నేహితుడికి స్పెషల్ కాఫీ ఇప్పించి బాతాఖానీ వేస్తున్నాడు. స్నేహితుడు ఠక్కున మాట లాపేసి వీళ్ళవంక చూశాడు. ఆ అమ్మాయి పక్కన షాపులోంచి పడే నీలం దీపం వెలుతురులో మెరుస్తోంది. 'స్ట్రయికింగు బ్యూటీ!' అన్నాడు స్నేహితుడు. హోటలు యజమాని తలతిప్పి చూసి గుర్తించాడు వీళ్ళని.

"రోజూ ఇదేవేళకి - సరిగ్గా ఎనిమిదింటికి వెడతా రీవైపు. ఆ అమ్మాయిని చాలా రోజులుగా చూస్తున్నాను. మరి యితనెవరో ?" స్నేహితుడు కుతూహలంలో ముందుకువంగి మెల్లిగా అడిగాడు : "ఐతే పెళ్ళికాలేదంటావా ?"

"ఏమో మరి. ఆ అమ్మాయి ఎక్కడో పనిచేస్తున్నట్లుంది. ఈ మధ్యే ననుకుంటా వీళ్ళ పరిచయం. కానీ - మహా ఉల్లాసంగా ఉంటా రోయి ఎప్పుడు చూసినా." సిగరెట్టు వెలిగించిన స్నేహితుడు ఒక దమ్ములాగి గాలిలో ఉంగరాలుగా పోయే పొగవంక చూశాడు.

''చూడు, పెళ్ళయినా కాకపోయినా ప్రేమలో మునిగివున్న వాళ్లు అల్లాగే వుంటారోయి నిత్యానంద జీవులల్లే! లోకమే దివ్యంగా కనుపిస్తుంది వాళ్ళకళ్లకి! అదృష్టవంతులు!'' ఒక నిట్టూర్పు విడిచాడు ఆ భావుకుడు.

యువతి, యువకుడు సైకిలుషాపు సమీపించారు ...

పెట్రోమాక్సు లైటు వెలుతురులో న్యూస్‌పేపరు చూస్తున్నాడు యజమాని. ఎవడో కుర్రాడు సైకిలు తీసుకొచ్చి పెట్టాడు షాపులో.

"మూడు గంటలు!" అన్నాడు యజమాని రోడ్డువైపు చూస్తూ.

"ఎక్కడా ? 7-45 ఐందిప్పుడు, ఐదింటికి తీసుకెళ్లాను." యజమాని గడియారం వంకైనా చూడకుండా, "ఎనిమిది ఇప్పుడు. నీ గడి

యారంస్లో" అన్నాడు. ఆ కుర్రాడు డబ్బిచ్చేసి వెళ్లిపోయాడు మీమాంస పడకుండా. అతను వెళ్ళగానే షాపులోని పనివాణ్ణి చూసి నవ్వాడు యజమాని.

"ఏమిటి కరక్టాండి ?'' అన్నాడు పనివాడు కూడా నవ్వుతూ.

''ఔనోయ్ ! అదుగోచూడు జంట ! గడియారాలు తప్పినా వాళ్లు తప్పరు."

కుర్రాడు ఇదివరకే చూశాడు, "ఔనుగానీండి. ఎవరంటారు వీళ్లు ? ఆ అమ్మాయి మాత్రమండీ ... ... ''

"మరే. బహునాజూగ్గా ఉంటుంది. ఈమధ్యే పెళ్ళయిందికాబోలు. రోజూ బస్సు ఎక్కించాలి, దింపాలి ! ఇట్లా ఉన్నాయిరోజులు ! "

కుర్రాడు ముసిముసి నవ్వులు నవ్వాడు. ''ఔనండి. అల్లాగే అనిపిస్తుంది. ఇంకా చూశారో లేదో, ఎప్పుడూ నవ్వేనండి ఆవిడ ముఖాన.'' యజమాని తన వుంగరాలు సవరించుకున్నాడు. 'ఊ' అని ఒకసారి మూలిగి పేపర్లోపడ్డాడు.

అమ్మాయి, అబ్బాయి ముందుకు సాగారు ... మేడ, తోట. పైన బాల్కనీలో లైటు వెలుగుతోంది. ముసలాయన, రెండోపెళ్ళిభార్య కుర్చీల్లో కూచొని ఉన్నారు. ఆవిడ దూరాన్నుంచే వీళ్ళని గుర్తుపట్టి కుర్చీలోంచి లేచింది.

''అదుగో చూడండి" అన్నది ముసలాయనతో. ఆయన కూడా లేచి నుంచున్నాడు. ఆ అబ్బాయి పూలదండ అందించాడు. ఆ అమ్మాయి అటూ ఇటూ చూచి తల్లో తురుముకుంది.

'' ఏమిటి చూసేది ?'' అన్నాడు ముసలాయన చిరాకుగా.

''అదే అన్యోన్యత. రోజూ ఇదేవరస. పొద్దున్నే వెడతారు, ఈపాటి వేళ తిరిగొస్తారు. ఎప్పుడూ నవ్వే ఆపిల్ల ముఖాన. అదృష్టవంతురాలు!"

ముసలాయనకి వళ్లుమండుకొచ్చింది. ''ఇప్పుడు నీకు ఏం తక్కువైందని? అందర్ని చూసి అల్లా కళ్ళ నీళ్లెట్టుకుంటావు. రోజూ యిదే వరస. వాళ్లు రాగానే పెద్ద పనున్నదానల్లే చూస్తావు. ఒళ్ళు మండుతుంది." ఆయన ధాంధూంలాడుతూ లోపలికెళ్లాడు. ఆవిడ సణుక్కుంటూ కుర్చీలో కూలబడింది.

ఆ అమ్మాయి, అబ్బాయి మసీదు కెదురుగా సందులోకి తిరిగారు. పెద్ద మేడముందు ఆగారు. ఆ అమ్మాయి తాళంతీసింది. లోపలికివెళ్ళి లైటు వేసింది. అతను పుస్తకాలు కిటికీలో పడేశాడు.

"ఏమంటావు యింతకీ?" అన్నాడతను, ఆ అమ్మాయి చెప్పులు తీసి ఒకమూలకి విసిరింది.

"ఏమంటాను? ఎల్లుండి ప్రొద్దున్నే బయలుదేరి వెళ్లాలంటాను ఎన్నిసార్లు చెప్పాను ఆమాట నీకు?"

"అదికాదు మా—విను నామాట. ఎందుకొచ్చిన ఖర్చు? పినతల్లి ఆడబడుచు కూతురంటే దగ్గర చుట్టంకాదు. ఆవిడ పెళ్లికి వెళ్ళకపోతే ఏమిటి యిబ్బంది? ఎందుకిప్పుడు ఏభై రూపాయలుఖర్చు అంటాను. కాస్త ఆలోచించు." అతను కాస్త చిరాగ్గానే మాట్లాడు తున్నాడు.

"ఔను. మీకన్నీ అనవసరం ఖర్చులుగానే కనిపిస్తాయి. పెళ్లిముందు చెప్పినమాటలన్నీ ఏమైనాయో? నన్ను అందలం ఎక్కించేట్లుగా చెప్పావు కబుర్లు. ఆ అమ్మాయి నాకు స్నేహితురాలు. నేను వెళ్లితీరాలి."

అతను కుర్చీలోంచి లేచి కిటికీలో పుస్తకాలు తీసుకున్నాడు. "సరే నీయిష్టం. ఏకుమేకువై కూర్చుంటావని అనుకోలే దెప్పుడూ.

పెళ్లిముందు నువ్వు చెప్పావు చాలా కబుర్లు. నామాటంటే వేదం అన్నట్లు ప్రవర్తించావు. ఇప్పుడు......"

ఆ అమ్మాయి ఉక్రోషం ఆపుకోలేక పోయింది. "ఔను. పరమ గయ్యాళినైనాను. పోనీలే. చేసుకున్నవారికి చేసుకున్నంత. ఏంచేస్తావు నీ దురదృష్టం ? పద అన్నంతిందాం" అన్నదా అమ్మాయి వంటింటి తలుపు గొళ్ళెం తీస్తూ.

ఆ అబ్బాయి పేపర్లో తల దూర్చాడు.

"నా కక్కర్లేదు. నువ్వు తిను."

ఆ అమ్మాయి ఫెడేలున వేసేసింది వంటింటి తలుపు.

"సరే. నాకూ ఆకలిలేదు." గబగబ ఒక తలగడ, దుప్పటీ తీసుకొచ్చి మంచం వాల్చింది "ఇంక శయనించండి" అన్నది.

అతను మొహం మాడ్చుకొని మంచంమీద వాలాడు. సిగరెట్టు వెలిగించి కిటికీలోంచి ఆకాశంవంక చూస్తూ పడుకున్నాడు.

ఆమె వంటిల్లు వూడ్చి, అక్కడే ఒక చాప వేసుకుని పడుకుంది. ఆ రాత్రి ఉపవాసం. జాగారం ఆ జంటకి......

తెల్లవారి తొమ్మిదింబావు—

మసీదు కెదురుగా సందులోంచి రోడ్డుమీదకు వచ్చారు అమ్మాయి, అబ్బాయి. బెంగాలీల మేడ దాటారు. ఆ రెండోపెళ్లి భార్య, సవితికూతురు బాల్కనీలోకివచ్చి తొంగిచూశారు.

సైకిలుషాపు, హోటల్ దాటారు ఆజంట. కంఠాలు తగ్గించి మాట్లాడుకుంటూ బస్‌స్టాపు చేరారు. బస్ వచ్చింది. ఆ అమ్మాయి ఎక్కింది. అతను చిరునవ్వుతో చెయ్యి వూపాడు.

[1955]